

# ఏటి ఒడ్డున నీటిపూలు

## - కోలిపాక రమామణి



రమామణిగారు 29 యేళ్ళ వయసులో వ్రాసిన మొదటి నవల ఈ 'ఏటి ఒడ్డున నీటిపూలు'. పోటీల్లో బహుమతి గెలుచుకుంది. తర్వాత కన్నడపత్రికలో అనువాదమై సీరియల్ గా వచ్చింది. అప్పుడు పుస్తకరూపంలో వెలువడింది. ఆ తర్వాత నాలుగైదు సంవత్సరాల వ్యవధిలోనే 'వెన్నెల్లో పిల్లనగ్రోవి', 'గడ్డిపోచలు','హాలాహలంలో అమృతం' లాంటి పాఠకాదరణ పొందిన నవలలు వ్రాశారు. అప్పటి అన్ని ప్రముఖపత్రికలలోను, ఆకాశవాణికి కథలు కూడా వ్రాశారు.

*(గత సంచిక తరువాయి)*

ఆంధ్రప్రభ వారపత్రిక ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల (1968)

తొమ్మిది గంటలకే పుస్తకాలు పుచ్చుకుని కాలేజీకి బయలుదేరిన పద్మ, పావు తక్కువ పది అయినా బస్సు స్టాండులోనే నిల్చోవడం చూసి ఆశ్చర్య పోయాడు మాధవరావు. ఇంటి దగ్గిర నించి పద్మ బయలు దేరిన అరగంటకి బయలు దేరుతాడు మాధవరావు. అప్పటికి పద్మ బస్సు ఎక్కి వెళ్లి పోతుంది. కాని ఈ రోజు పుస్తకాలు పట్టుకుని ఇంకా అక్కడే నిలుచుని ఉంది. మాధవరావు పద్మ దగ్గిరికి వెళ్లి ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఒక పక్కన నిలుచున్నాడు.

పద్మ మెల్లిగా భర్త పక్కకి వచ్చి నిలబడి, "మీతో మాట్లాడాలి. అలా ఒకసారి వస్తారా?" అంది.

మాధవరావు తెల్లబోయాడు. రెండడుగులు నడిచి బస్సు స్టాండు నించి దూరంగా వచ్చి అడిగాడు.

"నాతో ఏం మాట్లాడాలి?"

"నేను చాలా మాట్లాడాలి" అంది పద్మ.

"అందరూ చూస్తే ఏమనుకుంటారు? నా ఆఫీసుకి వేళ్లై పోతుంది కూడా."

"అందరూ ఏమనుకుంటారు? తన భార్యతో భర్త మాట్లాడడంలో తప్పేముంది? నేనివాళ కాలేజీకి వెళ్ళడం లేదు. మీరూ ఆఫీసుకి సెలవు పెట్టండి."

"సెలవు పెట్టి ఏం చేద్దాం?"

"ఎక్కడికైనా వెళ్లి మాట్లాడుకుందాం."

"నాకీ రోజు ఆఫీసుకి సెలవు పెట్టడానికి వీల్లేదు. పని ఉంది."

"రేపు పెడతారా? నేను బస్సు స్టాండ్ లోనే కలుసుకుంటాను." పద్మ భర్తని గుచ్చి చూస్తూ అడిగింది.

మాధవరావు ఏమనుకున్నాడో, "సరే" అని బస్సు స్టాండు వేపు వెళ్లి పోయాడు.

పద్మ తన బస్సు రాగానే ఎక్కి కాలేజీకి వెళ్ళింది. బస్సులో కూర్చున్నంత సేపు మనిషి కంపిస్తూనే ఉంది. మనసులో మాత్రం 'ఊహించుకున్నంత కష్టం కాదు' అనుకుంది.

మరునాడు పద్మ తిరిగి బస్సు స్టాండులో భర్త కోసం ఎదురు చూస్తూ నిలుచుంది. మాధవరావు మామూలుగా ఆఫీసు వేళకే వచ్చాడు. వెంటనే పద్మ అతని పక్కకి వెళ్లి నిలుచుని, "ఎక్కడికి వెళదాం?" అంది.

"ఏదైనా హోటల్ కి వెళదాం" అన్నాడు మాధవరావు.

"హోటల్ కి వద్దు. మీతో ఏకాంతంగా చాలాసేపు మాట్లాడాలి" అంది పద్మ.

మాధవరావు కాస్సేపు ఆలోచించి, 'సరే, పీపుల్స్ పార్కుకి వెళదాం" అన్నాడు.

ఇద్దరు బస్సు ఎక్కి  మూర్ మార్కెట్ దాకా నడిచారు. పద్మకి మద్రాసులో ఇల్లూ, కాలేజీ తప్ప వేరే ప్రదేశం తెలియదు. మూర్ మార్కెట్ లో రకరకాలైన వస్తువుల్నీ, వింతైన షాపుల్ని చూడగానే, కళ్ళు అటే నిలిచి పోయాయి. అవన్నీ చూడాలని ఉన్నా, భర్త ముభావంగా ఉండడం చూసి, తను తలవంచుకుని అతన్ని అనుసరించింది.

మూర్ మార్కెట్ వదిలి, కార్పొరేషన్ స్టేడియం దాటి, పీపుల్స్ పార్కు చేరారు. పార్కులో జంతుశాల కూడా ఉంది.

అందమైన పూలు, పచ్చని చెట్లు చూడగానే పద్మ పరవశించింది. చిన్నపిల్లలా పూవులా మధ్య పరిగెత్తాలనిపించింది. తను, భర్త చేయి చేయి పట్టుకు ఒక్కసారి పార్కు అంతా చుట్టి రావాలనిపించింది. అన్ని కోర్కెలూ మాధవరావు మౌనం లో అణిగి పోయాయి.

మాధవరావు ఒక పెద్ద చెట్టు కింద మంచి జాగా చూసుకు కూర్చున్నాడు. అతనికి ఎదురుగా కూర్చుంది పద్మ. చుట్టూ ఉన్న పొదలు వారిని బయటి ప్రపంచం నించి వేరు చేస్తున్నాయి.

ఎలా మొదలు పెట్టాలా? అనుకుంటూ భయంతో తలవంచుకుని కూర్చుంది పద్మ. పుస్తకాలలో పేజీలు  తిప్పుతూంది చేతితో. మాధవరావు దిక్కులు చూస్తూ కూర్చున్నాడు. ఎదురెదురుగా కూర్చున్న ఆ అందమైన జంట భార్యాభర్తలుగా, స్నేహితులుగా లేరు. విరోధుల్లా ఎడమొఖం పెడమొఖం అయి కూర్చున్నారు.

చివరికి మాధవరావు విసుగ్గా అన్నాడు. "ఏమిటి మాట్లాడాలి ?"

ఆమాటా, మాట్లాడే తీరూ చూడగానే ఒక్కసారి అసహ్యం వేసింది పద్మకి. దానితో పాటు మొండి ధైర్యం వచ్చింది.

"ఎన్నాళ్ళీ కాపరం?" అంది.

"అంటే?" కనుబొమలు ముడుస్తూ అన్నాడు.

"మనం అపరిచితులుగా, విరోధులలాగా గడపడం ఎన్నాళ్ళు?"

"మనమేమీ విరోధులం కాము." మాధవరావు అన్నాడు.

"విరోధులం కాక పోతే, మీరు నాతో ఎప్పుడూ మాట్లాడరు ఎందుకని?"

"అవసరం ఉండదు కనక."

"భార్యతో మీకు ఏ అవసరం లేదా?"

"లేదు."

"మరి పెళ్లి ఎందుకు చేసుకున్నారు?"

"అమ్మ కోసం."

"అమ్మ చేసుకోమన్నారా? మరి అమ్మ పెళ్ళాంతో కాపరం చెయ్య వద్దన్నారా?"

"అమ్మ కాపరం చెయ్య వద్దనలేదే?"

"మరెందుకు అంటీముట్టనట్టు ఉంటారు నాతో?"

"ఎలా ఉండమంటావు?"

పద్మకి ఎలా వివరించాలో తెలియలేదు. కోపం వచ్చింది.

"ఎలా ఉండమంటానా? అందరు భర్తలూ వారి భార్యలతో ఎలా ఉంటారో అలాగే ఉండమంటాను. సరదాగా మాట్లాడమంటాను. భార్యతో కలిసి జీవించమంటాను. కలిసి తిరగమంటాను. కష్ట సుఖాలు భార్యతో పంచుకోమంటాను. సంతోషం, దుఃఖం భార్యతో కలిసి అనుభవించమంటాను." ఉద్రేకంగా మాట్లాడింది పద్మ.

"కాని నిన్ను బయటికి తీసుకువెళితే, మాట్లాడుతూ ఉంటే అమ్మ బాధపడుతుంది!"

"మాట్లాడకపోతే నేను బాధ పడతాను. భార్య ముఖ్యం కాదా మీకు? అమ్మే ముఖ్యమా?"

"అవును, అమ్మే ముఖ్యం. అమ్మ సుఖమే ముఖ్యం నాకు."

పద్మ హతాశురాలైపోయింది.

"నేనుకూడా మనిషినని ఎందుకు గుర్తించరు మీరు? నాకూ కోరికలు ఉంటాయి. నాకూ సరదాలు ఉంటాయి. మీ అమ్మ సుఖం కోసం నా సుఖం ఎందుకు బలి చేసుకోవాలి? " పద్మ తల మోకాళ్ళ మీద పెట్టుకుని ఏడ్చింది.

మాధవరావు దూరంగా అలాగే మౌనంగా కూర్చున్నాడు. అతను భార్య దగ్గిర చేరి ఊరడించలేదు. ఆప్యాయంగా ఆపలేదు. ఏడ్చి తన బలహీనత బయటపెట్టుకున్నందుకు పద్మే బాధ పడింది. కళ్ళు తుడుచుకుంది.

"మా అమ్మ జీవితం తెలిస్తే నువ్విలా మాట్లాడవు" అన్నాడు మాధవరావు.

పద్మ ఏం మాట్లాడలేదు. అతని ముఖం చూస్తూ ఊరుకుంది.

"మా అమ్మ చాలా దురదృష్టవంతురాలు. ఆవిణ్ణి చూసి జాలిపడాలి. అమ్మ పురిటి గుడ్డుగా ఉండగానే మా అమ్మమ్మ చనిపోయింది. అమ్మమ్మ చనిపోయి ఏడాది తిరగక ముందే మా తాతగారు మళ్ళీ పెళ్లి చేసుకున్నారు. కొత్త భార్య చాలా గయ్యాళి. ఆవిడకీ ఏడాదిలోనే ఒక ఆడపిల్ల పుట్టింది, అంటే మా పిన్ని.

మా అమ్మ ఎంతో అందగత్తెట. మా పిన్ని బాగుండేది కాదుట. దీనితో మా కొత్త అమ్మమ్మకి అమ్మ అంటే ఈర్ష్యట. ఎప్పుడూ సమంగా చూసేది కాదుట. కొత్త భార్య మోజులో ఉన్న తాతగారు కూడా అమ్మని పట్టించుకునే వారు కారుట. చిన్నతనంలోనే అమ్మకి తలిదండ్రుల ప్రేమ కరువైంది. 'నీనేను ఎవ్వరికీ అక్కరలేదు. దేవుడు నన్నెందుకు పుట్టించాడు?' అని ఏడ్చేదిట, ఒంటరిగా కూర్చుని అమ్మ,

కొంచెం పెద్దది అయ్యాక సవితి తలితండ్రుల ప్రేమ కోసం వాళ్ళు చెప్పిన మాటల్లా విని చాలా బుద్ధిగా ఉండేదిట. సవితి తల్లి చెపిన పని అల్లా చేసేదిట. కాని చివరికి అమ్మకి చాకిరియే మిగిలింది. అనురాగం కరువైంది. ఏ కొత్త వస్తువు తెచ్చినా పిన్నికి ముందుగా ఇచ్చి, మిగిలినవి అమ్మకి ఇచ్చేవారుట. తాతగారు కోర్టు నుంచి వస్తున్నప్పుడు అమ్మ, పిన్ని రోజూ రోడ్డు మీదికి పరిగెత్తుకు వెళ్లి కలుసుకునే వారట. తాతగారు అమ్మ భుజం మీద ఒక్కసారి చరిచి ఊరుకునేవారుట. పిన్నిని మాత్రం రెండు బుగ్గల మీద ముద్దు పెట్టుకుని, ఎత్తుకుని ఇంట్లోకి తీసుకు వెళ్ళేవారుట. అమ్మ 'నాన్న  నన్ను ముద్దు పెట్టుకుని, ఎత్తుకు తీసుకు వెళ్ళరేం?' అనుకుని బాధపడేదిట.

అమ్మకి పధ్నాలుగు ఏళ్ళప్పుడు పెళ్లి చేశారుట. పెళ్ళిలో కూడా పక్ష పాతం. పిన్నికి బోల్డు కట్నం ఇచ్చి బాగా చదువుకున్న అబ్బాయిని చేశారుట. అమ్మకి మామూలు సంబంధం చేశారు. మా నాన్న అంత చదువుకోలేదు.

అమ్మ పెళ్లి అవగానే కాపరానికి వచ్చిందిట. అమ్మకి అత్తగారు, ఒక ఆడపడుచు ఉండేవారుట. ఇద్దరూ చిన్నపిల్లయిన అమ్మని ఎన్నో బాధలు పెట్టే వారుట. రోజూ మోటబావిలో నించి నీళ్ళు తోడడం, ఇంటెడు చాకిరి, వంటపని... అన్నీ అమ్మేనుట. నాన్నగారు ఎప్పుడూ పొలం పనుల మీద తిరిగేవారుట. ఇంట్లో ఉన్నప్పుడు కూడా అమ్మతో ఎక్కువ మాట్లాడేవారు కాదుట. ఆయనకి తల్లి వాక్కు వేదవాక్కు. ఆవిడ ఎలా

చెబితే అలా చేసేవారుట. అమ్మతో ఆయన కాపరం చేసింది నాలుగు నెలలేనట. ఒక రోజు పొలంలో పావు కరిచి హఠాత్తుగామరణించారు మా నాన్నగారు. అమ్మకి అప్పటికి మూడోనెల కడుపు.

కొడుకు మరణించగానే కోడలిని ఇంట్లోంచి పొమ్మనారుట అత్తవారు. అమ్మ ఎక్కడికి వెళుతుంది? అటు సవితితల్లి ఆరడి, ఇటు అత్తగారి విదిలింపు. భర్త మరణంతో కుములుతున్న అమ్మ, 'నేను ఎవరికీ అక్కరలేదు. నన్నెందుకు చంపెయ్యవు భగవంతుడా!' అని ఏడ్చేదిట.

అత్తగారు పెట్టె కష్టాలకీ, సూటీపోటీ మాటలకీ తట్టుకోలేక పుట్టిల్లు పట్టింది అమ్మ. 'దిష్టి ముఖం, మూడునేలలకే మొగుణ్ణి పొట్టన పెట్టుకుంది' అని తిట్టేదిట సవితితల్లి.

అమ్మకి నేను పుట్టగానే కొంత ధైర్యం వచ్చిందిట.

'నేను బ్రతకాలి. నేను పోతే నా బాబుని ఎవరు చూస్తారు?' అనుకునేదిట. రోజంతా పసిపిల్లవాడితోనే గడిపేదిట. పిల్లవాడిని ఎవ్వరూ ముట్టుకోకూడదుట. అమ్మని ఏడిపించాలని అప్పుడప్పుడు సవితి తల్లి పిల్లాడిని దాచేసేదిట. అలా చేసినప్పుడల్లా అమ్మ పిచ్చెత్తినట్టు ఏడుస్తూ, జుత్తు పీక్కుంటూ ఇల్లంతా పరిగెత్తేదిట!

అమ్మ కష్టాలు పడుతూ పుట్టింట్లో అయిదు ఏళ్ళు ఉంది. ఇంతలో మా తాతగారు మా నాన్నగారి ఆస్తి కోసం దావా వేశారు. అమ్మకి మా నాన్నగారి ఆస్తి అయిదు ఎకరాలు వచ్చింది. పొలం మీద రైతులని నియమించి, శిస్తు అమ్మకి వచ్చేటట్లు ఏర్పాటు చేశారు తాతగారు. ఆస్తి రాగానే అమ్మ తన కొడుకుతో వేరే ఉంటానని చెప్పిందిట.

తాతగారే మద్రాసులో ఇల్లు చూసి, అమ్మని ఇక్కడికి తీసుకు వచ్చారు. అప్పటికి అమ్మ వయస్సు ఇరవై సంవత్సరాలు. నేను అయిదేళ్ళ వాడిని. మేం ఇద్దరం మద్రాసులో ఆ ఇంట్లో బిక్కుబిక్కు మంటూ ఉండే వాళ్ళం. అమ్మకి నేను, నాకు అమ్మ. మా ఇద్దరికీ ఇంక ఎవరూ సాయం లేరు.

ఒంటరిగా, చిన్న కొడుకుని పెట్టుకుని బ్రతికే అమ్మ ఎన్ని బాధలు పడిందో! అమ్మ ఆశలన్నీ నా మీదే. ఆవిడ ప్రేమంతా నా మీదే. కొడుకే ఆవిడికి సర్వస్వం. నా ప్రేమంతా ఆవిడకే కావాలి. ఇంకెవరినైనా నేను ఇష్టపడుతున్నానంటే ఆవిడ సహించలేదు. నేను ఒక అరగంట ఆలస్యంగా ఇల్లు చేరితే ఆవిడ ప్రాణం విలవిల్లాడుతుంది."

మాధవరావు ఆగాడు. అతని ముఖం కోపంతో కందగడ్డలా ఎఱ్ఱపడింది. పద్మకి భర్తని చూస్తే భయం వేసింది. ఏదైనా చెప్పి అతనిని ఊరడించాలని ఉన్నా, ఏం చెప్పాలో తెలియక మౌనంగా ఉండి పోయింది.

కాసేపు ఉన్నాక మాధవరావే మాట్లాడాడు.

"మా అమ్మని కష్టాలు పెట్టిన ప్రతివాళ్ళని తలచుకుంటే, చూస్తే నాకు వాళ్ళని తన్ని, చంపాలని ఉంటుంది. బంగారం లాటి అమ్మ జీవితాన్ని నాశనం చేశారు. ప్రేమ, అభిమానం, ఆప్యాయత ఎరగదు అమ్మ. అమ్మకి అవన్నీ ఎండమావులు. ఏం తప్పు చేసిందని అమ్మ వంచించ బడాలి? అమ్మని క్రూరంగా హింసించిన మానవులంటే అసహ్యం నాకు. అందరి దగ్గిర నించి దూరంగా అమ్మని తీసుకు వెళ్ళిపోవాలని ఉంటుంది. అమ్మ కోసం, అమ్మ సుఖం కోసం ఏమైనా చేస్తాను నేను. నా జీవితమంతా ఆవిడికే అంకితం చేస్తాను. ఆవిడ ఇక కంట నీరు పెట్టకూడదు; ప్రేమ కోసం తపించకూడదు."

మాధవరావు కళ్ళలో తిరిగిన నీళ్ళు చూసి చలించింది పద్మ. అతని తలని తన గుండెలకు హత్తుకుని ఊరడించాలని పించింది.

హఠాత్తుగా లేచాడు మాధవరావు.

"ఇంకా వెళ్లి పోదాం, పద" అన్నాడు.

పద్మ తెల్లబోయింది. "కాసేపు కూర్చుందాం" అంది లేవకుండానే.

"ఊహు, నేనిక్కడ కూర్చోను. అమ్మకి తెలిస్తే బాధ పడుతుంది" అన్నాడు.

"అమ్మకి ఎలా తెలుస్తుంది?" ఆశ్చర్యపోతూ అడిగింది పద్మ.

'అమ్మకి తెలిస్తే బాధపడుతుంది.' అతని జవాబు మూర్ఖంగా వినిపించింది.

"ఇప్పుడు ఎక్కడికి వెళ్ళటం? మధ్యాహ్నం ఒంటి గంట అయింది. ఇంటికి ఎలా వెళ్ళను?" అంది పద్మ.

"నువ్వు కాలేజీకి వెళ్లి పో. నేను మధ్యాహ్నం సెలవు కాన్సిల్ చేసుకుని ఆఫీసులో పని చేస్తాను." మాధవరావు వెనక్కి తిరిగి నడక సాగించాడు. పద్మకి లేవక తప్పింది కాదు.

సెంట్రల్ స్టేషన్ దగ్గిర ఇద్దరూ రెండు బస్సులు ఎక్కి రెండు గమ్యాల వైపు ప్రయాణం సాగించారు.

కాలేజీలో ఒక్క పాఠం వినలేదు పద్మ. ఆలోచనలన్నీ అత్తగారి వేపు, భర్త వేపు పరిగెత్తాయి. అత్తగారు చిన్నప్పుడు ఎన్నో కష్టాలు పడ్డట్లు ఈ రోజే తెలిసింది. ఇప్పటికేనా భర్త హృదయం విప్పి అన్నీ తనతో చెప్పినందుకు సంతోషంగానే ఉంది. అత్తగారిని చూస్తే జాలి వేసింది.

కాని పద్మకి ఎన్నో ఊహలు ప్రశ్నలుగానే మిగిలి పోయాయి. అత్తగారు కొడుకుని ప్రేమించినట్టే కోడలిని కూడా ఎందుకు ప్రేమించ కూడదు? తను అత్తగారిని నెత్తిమీద పెట్టుకుని పూజిస్తుందే! తనని అత్తగారు ఎందుకు అసహ్యించుకుంటుంది? అత్తగారికి కరువైన సుఖం, సంతోషం కోడలికి కూడా అందకూడదా? ఇదెక్కడి సిద్ధాంతం!

అంత అయోమయంగా ఉంది. భర్తతో మాట్లాడి తన సమస్యలు తీర్చుకుని, కాపరం చక్కబరచు కోవాలని అనుకుంది. కాని ఇప్పుడేమైంది? చీకటి మాయమైన బయలులో నించి పరిగెత్తి, అంధకార బంధురమైన అడివి మధ్య చిక్కుకు పోయింది.

## 24

భానుమతికి పెళ్లి అయ్యాక ఇంట్లో జరిగిన పెద్ద మార్పులేమీ లేవు. ముందు గదికి వెనక గదికి మధ్య తలుపులు తెరుచుకున్నాయి. ఇంటిలోకి, బయటకి రాక పోకలు ముందు ద్వారం గుండానే జరుగుతున్నాయి. రాత్రి మాత్రం ముందు గది నూతన దంపతులకి ప్రత్యేకించారు. రామారావుగారు అల్లుడి హోదాలో వంటింట్లో శాంతమ్మ చేతి భోజనం తింటున్నారు. "మాస్టారూ!" అని గౌరవంగా పిలిచే పిల్లలంతా "బావగారూ!" అని ఆప్యాయంగా పిలుస్తున్నారు. చారుమతి సంపాదనకి రామారావుగారి సంపాదన కూడా కలవడం వాళ్ళ కుటుంబం ఆర్థిక దుస్థితి నించి కొంచెం కోలుకుంది. 'ఆయాసపడుతూ పరుగులెత్తడం మాని కాస్సేపు నిలబడి నీళ్ళు తాగవచ్చును' అనుకుంది చారుమతి.

ఇంట్లో అందరినీ బాధించే విషయం ఒక్కటే. శంకరాన్ని గురించిన బెంగ. శంకరం దగ్గిరినించి ఒక్క ఉత్తరమూ లేదు. ఇంటి నించి పారిపోయి ఏడాది పైన అయింది. అందరి కంటె బాధ పడేది ముసలమ్మ. ఆవిడ శంకరాన్ని తలచుకుని బాధపడని రోజు లేదు.

జనవరి వచ్చింది. సంక్రాంతి వెళ్లి మూడు రోజులైంది. ఇంకా చలి' ఉన్నాను' అంటూంది.

ప్రొద్దున్నే ముఖం కడగడానికి ముసలమ్మ దగ్గిరికి వేడి నీళ్ళు తీసుకు వెళ్ళిన భానుమతి ఆవిణ్ణి చూసి భయపడింది. మనిషి మైకం కమ్మినట్టు కళ్ళు మూసుకుని పడి ఉంది. పిలిస్తే పలకలేదు.

"అమ్మా! మామ్మ ఇలా ఉందేమిటమ్మా! పిలిస్తే పలకటం లేదు" అంటూ భానుమతి తల్లిని కేక వేసింది.

వంటపని చూసుకుంటున్న శాంతమ్మ హడావిడిగా వచ్చి, "అత్తా, అత్తా" అంటూ తట్టి లేపింది. ముసలమ్మలో చలనం లేదు. "అల్లుడిగారిని పిలుచుకు రామ్మా!" అంది భగవతి వైపు తిరిగి.

రామారావుగారు వచ్చి చూశారు. ముసలమ్మ చనిపోయిందేమోనని భయం వేసింది ఆయనకీ. వెంటనే డాక్టరు కోసం వెళ్ళారు.

డాక్టరు వచ్చి ముసలమ్మని చూసి పెదవి విరిచి ఇలా అన్నారు.

"ఈవిడ మైకంలో ఉంది. బ్రతుకుండానే ఆశ ఎక్కువ లేదు."

అందరి గుండెలు ఝల్లుమన్నాయి ఒక్కసారి. ముసలమ్మ చాలా రోజుల నించి జబ్బుగా ఉన్నా ఇంత తొందరలో పోతుందనుకోలేదు.

"ఎన్ని రోజులు ఆశ ఉంది అంటారు?" రామారావుగారు అడిగారు.

"ముసలివాళ్ళతో ఏమీ చెప్పలేము. కొన్ని గంటలలో పోవచ్చును ప్రాణం. లేదా ఒక రోజంతా ఉండవచ్చును ఈ మైకంలో. కొంతమది రెండు మూడు రోజులు మైకంలో ఉన్నవాళ్ళు ఉన్నారు." డాక్టరుగారు వివరించి, "నేను చేయవలసింది ఇక్కడ ఏమీ లేదు" అంటూ వెళ్ళిపోయారు.

అందరు ఎక్కడి పనులు అక్కడ వదిలి వచ్చి ముసలమ్మ చుట్టూ చేరారు. రామారావుగారు, చారుమతి స్కూళ్ళకి సెలవు చీట్లు పంపారు.

ముసలమ్మ పరస్థితి తెలిసి ఇరుగు పొరుగు కూడా వచ్చి చూడటం మొదలు పెట్టారు. వచ్చిన వాళ్ళంతా ముసలమ్మ మంచితనం పొగుడుతున్నారు. ఆవిడ పడిన కష్టాలు తలుచుకుని వగరుస్తున్నారు. శాంతమ్మని, పిల్లలిని ఓదారుస్తున్నారు.

ఇంతలో ఛాందసుడైన ఒక వృద్ధు వచ్చి పెద్దగా హాహాకారాలు చేశాడు. "అయ్యయ్యో! ఇంత బ్రతుకూ బ్రతికిన ముసలమ్మని మంచం మీద పడుకో బెట్టారా? కింద పడుకోబెట్టండి. మంచం మీద చస్తే పరలోకం పొందదు ఆవిడ."

"ఇంట్లో చనిపోతే నక్షత్రం మంచిది కాకపోతే ఇల్లు పాడుబెట్టాలి. వీథిలో పడుకోబెట్టండి. ఆవిడ ఎప్పుడు ప్రాణం వదులుతుందో తెలియదాయె" అన్నారు మరొకరు.

చుట్టూ మూగిన ఇరుగు పొరుగు ఈ రెండు సూచనలకి తల ఊపి మద్దతు ఇచ్చారు.

శాంతమ్మ నిస్సహాయంగా అల్లుడి వేపు చూసింది. రామారావుగారు ఏమీ పాలుపోనట్లు నిలుచున్నారు.

"అయ్యా మాస్టారూ! వీథిలోచాప వేసి ముసలావిడని పడుకోబెట్టండి. నలుగురం మేము కూడా సహాయం చేస్తాం" అన్నారు ఒకాయన.

వీథిలో చాప వేసి ముసలమ్మని పడుకోబట్టారు. బెండులా ఎండిపోయి, బొమ్మలా తేలికగా ఉన్న ముసలమ్మని బయట పడుకోబెడుతూ, ఈవిణ్ణి మోయడానికి నలుగురెందుకు? నేను ఒక్కణ్ణి చాలు' అనుకున్నారు రామారావుగారు.

వీథిలో ముసలమ్మని పడుకోబెట్టడం పెద్ద ఇబ్బందే తెచ్చి పెట్టింది. వీథిలో వెళ్ళే ప్రతివాళ్ళూ ఒకసారి ముసలమ్మని తొంగి చూసి, కారణం అడిగి, సానుభూతి వాక్యాలు పలికే వారు. వచ్చేపోయే వాళ్ళతో చిన్న గుంపు చేరింది ఇంటి ముందు.

""ఏమిటీ గొడవ? వీళ్ళందరికీ చెప్పలేక మన ప్రాణం పోతూంది. ఇంట్లోనే పడుకోబెడదాం, బావగారూ. ఏమైతే అదే అవుతుంది" అంది చారుమతి.

"తీరా బయటికి తెచ్చి పెట్టాక మళ్ళీ ఇంట్లో పడుకోబెడితే బాగుండదమ్మా" అన్నారు రామారావుగారు.

చివరికి ఆయనే ఉపాయం ఆలోచించారు. మూడు పాత దుప్పట్లు తీసుకువెళ్ళి రెండు రాటల సాయంతో ముసలమ్మ చుట్టూ తెరలు కట్టి, మరుగు ఏర్పరిచారు.

రేవతికి విశాఖపట్నం టెలిగ్రాం ఇచ్చారు.

చీకటి పడింది. రాత్రి అయింది. ముసలమ్మ ఇంకా ఇహలోకం వదలలేదు. అన్నపానాల మాట మరిచి ముసలమ్మచుట్టూ చేరిన పెద్ద, చిన్న మనుషులు అలిసిపోయారు.

"మీరంతా ఎందుకమ్మా ఇక్కడ? కళ్ళు మూసుకు పోతున్నాయ్. ఇంట్లోకి వెళ్లి నిద్ర పొండి" అంది శాంతమ్మ పిల్లల్ని చూస్తూ.

ముసలావిణ్ణి, తల్లిని విడిచి రావడానికి ఒకపక్క మనస్సు పీకుతున్నా, అలసట, నిద్ర ఇంకోవైపు నించి తరుముతూ ఉంటే అందరూ మెల్లిగా లోపల చేరి తలో మూలా నిద్రకి తల వాల్చారు. శాంతమ్మ, భానుమతి మాత్రం ఒక హరికెన్ లాంతరు పెట్టుకుని, దుప్పట్లు కప్పుకుని వీథిలో ముసలమ్మకి కాపలా కూర్చున్నారు.

"భాను! మీరిద్దరూ చలిలో ఎంత సేపు కూర్చుంటారు? మామ్మ గారిని లోపల పడుకోబెడదాం, పదండి" అన్నారు రామారావుగారు, రాత్రి పదకొండు గంటలకి బయటికి వచ్చి.

అత్తగారు మౌనంగా ఉండటం చూసి, ఆయనే ముసలమ్మని సునాయాసంగా తీసుకువెళ్ళి నులక మంచం మీద పడుకోబెట్టారు.

రెండో రోజు తెల్ల వారింది.ఇంకా ముసలమ్మ ఇహపరాల మధ్య వేళ్ళాడుతూ మైకంలోనే ఉంది.

"ఇవాళ ఈమిద మంచం మీద చనిపోతే మన పరువు దక్కదు; ఆవిడికీ పరలోకం దక్కదు. నిన్నంతా కూర్చున్న కష్టం అంతా ఫలితం లేకుండా పోతుంది. ఇవాళ కూడా వీథిలో పడుకోబెట్టండి" అంది శాంతమ్మ, ఉదయం లేస్తూనే.

మళ్ళీ ముసలమ్మ స్థానం వీథిలోకి మారింది. చుట్టూ పరదా ఏర్పడింది.

ఇంట్లో చారుమతి కాఫీలు చేసి అందరికీ ఇచ్చింది. మధ్యాహ్నం వంట చేసింది. మనసు కష్టపెట్టుకుంటూ పిల్లల బలవంతం మీద కొద్దిగా ఎంగిలి పడింది శాంతమ్మ.

"ఇంకా అవ్వగారు పోలేదా?" అంటూ ఇరుగు పొరుగు మళ్ళీ వచ్చి చూసి పోయారు. డాక్టరు వచ్చి ముసలమ్మని చూసి వెళ్ళాడు.

మధ్యాహ్నం రేవతి, భర్త గోపాలరావు, పిల్లలు వచ్చారు. ఆ రోజు వాళ్ళు కూడా శాంతమ్మ, పిల్లలతో పాటు వీథి లోనే ముసలమ్మ పక్కన కూర్చున్నారు.

మరణిస్తారని తెలిశాక, ఆ మరణం కోసం నిరీక్షణ కూడా విసుగే.

"ఇన్నాళ్ళూ జబ్బులతో మంచం మీద సాధించినది కాక, చచ్చిపోతూ కూడా సాధిస్తూంది మామ్మ" అంది భగవతి ఉండబట్టలేక.

"ఏమిటే ఆ మాటలు! నోరు మూసుకో" అంది రేవతి కసురుకుంటూ.

"అక్క జీతంలో సగం పైన మామ్మ మందులే మింగేశాయి" అంది తిరిగి భగవతి.

రేవతి భగవతి వీపు మీద ఒక్కటి అంటించి, "నువ్వు ఇంట్లోకి వెళ్ళు!" అంది కోపంగా.

ఆ రోజూ గడిచింది. ముసలమ్మ మాత్రం, 'ఈ లోకం వదలను. మీరింకా నాకు ఋణ పడి ఉన్నారు' అంటూ ఉండిపోయింది. రామారావుగారు తిరిగి ముందు రోజులాగే ముసలమ్మని లోపల పడుకోబెట్టారు.

ప్రయాణం చేసివచ్చిన రేవతి, భర్త, రెండు రోజుల నించి సక్రమంగా ఆహారనిద్రలు లేని శాంతమ్మ ఇంటివారు ఆ రాత్రి గాఢ నిద్రలో మునిగి పోయారు.

తన మొద్దు నిద్రని తట్టుకుంటూ పొద్దున్నే లేచిన శాంతమ్మ చల్లగా, కొయ్యలా ఉన్న అత్తగారిని చూసి హడిలి పోయింది. ఆవిడ పంతం పట్టినట్టు మంచం మీదే ప్రాణం వదిలింది.

ముసలమ్మకి తల కొరివి ఎవరు పెడతారనేది సమస్య అయిపోయింది. ఉన్న ఒక్క కొడుకు పైనా ఆశలన్నీ పెట్టుకుంటే, "నా దారి నాది" అంటూ అర్థాంతరంగా కన్ను మూశాడు సూర్యారావు. పోనీ, మనమడు ఆదుకుని తన పబ్బం గడుపుతాడని నిబ్బరంతో బ్రతికితే,

శంకరం దేశాలు పట్టి పోయాడు. అందరూ ఉండి ఎవరూ లేనట్టు అయిపోయింది ముసలమ్మకి. శాంతమ్మ భర్తని, కొడుకుని తలచుకుని ఏడ్చింది.

"మరణించాక ఏముంది? అంతా మట్టే! ఆ మట్టిని మట్టిలో కలపడానికి కొడుకైతేనేం, మనమడు అయితేనేం! వీధిని పోయేవాడు అయితేనేం? అంతా ఒకటే!" అన్నారు రామారావుగారు.

తామే ముసలమ్మ అంత్యక్రియలు యధావిధిగా జరుపుతామని శాంతమ్మకి మాట ఇచ్చి ఊరడించారు.

రేవతి భర్‌త గోపాలరావు, భానుమతి భర్త రామారావు ముసలమ్మ అంత్యక్రియలు జరపడానికి వెళ్ళారు. కష్టాలలో కొడుకులలా ఆదుకునే అల్లుళ్ళు దొరకటం తన అదృష్టంగా భావించింది శాంతమ్మ.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments